ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
శనివారం 10 ఆగస్టు 2024

కృష్ణానదికి వరద ఉధృతి కొనసాగుతోంది. ప్రకాశం బ్యారేజీకి శుక్రవారం ఉదయం 6 గంటలకు 2,98,425 క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. ఈ నీటి మొత్తాన్ని సముద్రంలోకి వదిలారు. శుక్రవారం సాయంత్రానికి కొంతమేర ప్రవాహం తగ్గడంతో 2,42,601 క్యూసెక్కులు సముద్రంలోకి, 13,796 క్యూసెక్కులు ప్రధాన కాలువలకు సాగునీటి అవసరాల నిమిత్తం వదిలారు. బ్యారేజీ నుంచి కేఈబీకి 1507, బందరు కాల్వకు 1300, ఏలూరుకు 1404, రైవస్‌కు 4619, కేఈ మెయిన్‌కు 8830, కేడబ్ల్యూకు 5527 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఒకవైపు లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతున్నా జిల్లాలోని 9వ నంబరు కాలువ ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందించకపోవడం నీటిపారుదల అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. రెండ్రోజుల్లో వరద ఉధృతి తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. - మచిలీపట్నం



పులిగడ్డ అక్విడెక్ట్ అంచు వరకు వచ్చిన వరద నీరు

వరద పోటు!

ప్రకాశం బ్యారేజీ నుంచి 2.42 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల

- మరో రెండు రోజులపాటు వరద నీరు
- పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద 11.5 అడుగులకు చేరిక
- పూర్తిగా కొట్టుకుపోయిన పాత ఎడ్లంక కాజ్‌వే
- పడవల్లో ప్రజలు, విద్యార్థుల రాకపోకలు
- లంక గ్రామాల్లో అప్రమత్తమైన అధికారులు

పులిచింతల ఆయకట్టుకు జలకళ

పులిచింతల ప్రాజెక్టు వద్ద నీటినిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు. ప్రస్తుతం 35.55 టీఎంసీల నిల్వ ఉంది. మిగిలిన నీటిని దిగువకు వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టులో నీటినిల్వ పెరగడంతో రెండు నెలల పాటు కృష్ణాడెల్టా పరిధిలోని 13.50 లక్షల ఎకరాలకు సాగునీటి ఇబ్బందులు తొలగినట్లయింది. ఈ నెల నుంచి నవంబరు వరకు నమోదయ్యే వర్షాలతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసే వివిధ రకాల పంటలకు సాగునీటి ఇబ్బందులు తొలగినట్టుగానే భావించాల్సి ఉంది.

కొనసాగుతున్న వరద

- కృష్ణానదికి వరదనీటి ప్రవాహంతో పులిగడ్డ అక్విడెక్టు వద్ద శుక్రవారం సాయంత్రానికి 11.5 అడుగుల మేర నదిలో నీరు ప్రవహిస్తోంది. అక్విడెక్టుకు నీటి ప్రవాహానికి మధ్య రెండు అడుగుల మేర మాత్రమే ఖాళీ ఉంది.
- పాత ఎడ్లంక నుంచి అవనిగడ్డకు రాకపోకలకు ఆధారంగా ఉన్న కాజ్‌వే శుక్రవారం పూర్తిస్థాయిలో కొట్టుకుపోయింది. ఈ గ్రామం నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కోసం ప్రత్యేకంగా ఒక పడవను, లైఫ్‌జాకెట్లు, లైఫ్ బాయిస్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, జనసేన నాయకుడు విక్కుర్తి శ్రీనివాస్ కాజ్‌వే వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అవనిగడ్డ తహసీల్దార్ మురళీధర్ గ్రామస్తులను అప్రమత్తంచేసి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.
- మోపిదేవి, ఘంటసాల, తోట్లవల్లూరు, పెనమలూరు, మండలాల్లో కరకట్ట వెంబడి రెవెన్యూ, పోలీసులతో నిఘా ఉంచారు.
- మోపిదేవి మండలంలోని ఉత్తర చిరువోలులంక, అయోధ్య గ్రామాల వద్ద కరకట్ట వెంబడి, షట్టర్లు ఉన్న ప్రాంతాల్లో, కరకట్ట కోతకు గురైనచోట్ల, లాకులు ఉన్న ప్రాంతాల్లో ఇసుక కట్టలు సిద్ధంగా ఉంచారు.
- అవనిగడ్డ మండల పరిధిలోని కొత్తపేట, యడ్లంక, దక్షిణ చిరువోలులంక రేగుల్లంక, మోపిదేవి మండలం బొబ్బర్లంక, కే-కొత్తపాలెం తదితర గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.
- ఘంటసాల మండలం శ్రీకాకుళం నుంచి గుంటూరు జిల్లా గాజుల్లంకకు ప్రజలు రాకపోకలు సాగించకుండా పోలీస్ పికెట్‌ను కొనసాగిస్తున్నారు.
- పెనమలూరు, తోట్లవల్లూరు మండలాల్లోని లంక గ్రామాలకు సమీపంలో నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. లంకల్లోని పొలాలకు రైతులు వెళ్లకుండా అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



పాత ఎడ్లంక నుంచి పడవపై వస్తున్న గ్రామస్థులు

ప్రభుత్వ, అసైన్డ్ భూములు హాంఫట్!

బందరులో అక్రమంగా ఆర్‌వోఆర్‌లో నమోదు

బందరు మండలంలోని ప్రభుత్వ, అసైన్డ్ భూముల రికార్డుల్లో మాయ చేశారు. పత్రాలు సక్రమంగాలేని భూములపై భీమవరానికి చెందిన బడాబాబులకు భూ హక్కు కల్పిస్తూ రైట్స్ ఆఫ్ రికార్డ్స్ (ఆర్‌వోఆర్)లో చేర్చారు. గుట్టుచప్పుడు కాకుండా జరిగిన ఈ అక్రమంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికారులంతా తమ విధుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో మూడో కంటికి తెలియకుండా భూముల బదలాయింపు కానిచ్చేశారు. ఈ అక్రమ వ్యవహారం బయటకు రావడంతో ఆర్డీవో కార్యాలయంలో దీనిపై పంచాయితీ పెట్టారు. పెద్ద వ్యవహారం కావడంతో ఈ విషయం ఎక్కడా వెల్లడి కాకూడదని నిర్ణయించిన రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోయారు.

- కోన-1, 2 రెవెన్యూ గ్రామాల్లో భూ మాయ
- భీమవరానికి చెందిన నలుగురి పేరుతో భూ రికార్డులు మార్చినట్టు చర్చ
- తహసీల్దార్ డిజిటల్‌సైన్ ఆధారంగా అక్రమాలు
- వందలాది ఎకరాలు స్వాహా
- రాత్రికి రాత్రి రికార్డులు తారుమారు
- కనపడకుండా మాయం చేసిన అక్కమార్కులు

పూర్తిస్థాయి విచారణ చేస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి



లక్షల్లో చేతులు మారిన నగదు

కోన-1, 2 రెవెన్యూ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఆర్‌వోఆర్‌లో చేర్చే అంశంపై లక్షల్లో నగదు చేతులు మారిందని రెవెన్యూ వర్గాలు చెప్పుకుంటున్నాయి. తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐ, వీఆర్వోలను తమ చెప్పుచేతల్లో పెట్టుకున్న బడాబాబులు ఎవరి వాటాలు వారికి ఇచ్చి ప్రభుత్వ, అసైన్డ్ భూములకు తామే హక్కుదారులుగా ఆర్‌వోఆర్‌లో పేర్లు నమోదు చేయించుకోవడం పట్ల రెవెన్యూ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌వోఆర్‌లో ప్రత్యేక నెంబరుతో పేరు నమోదైతే సంబంధిత రైతుల పేరున ఎంతభూమి ఉందనే వివరాలు మాత్రమే ఆన్‌లైన్ వస్తుందని, అదే అడంగల్‌లో అయితే సంబంధిత సర్వే నెంబరు, ఎందరు రైతులకు ఆ సర్వే నెంబరులో భూములున్నాయో తెలుస్తుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఈ భూ కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణచేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ రెవెన్యూ వర్గాల నుంచే వినిపిస్తోంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరు మండలం కోన-1, కోన-2 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఏడువేల ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు ఉన్నాయి. వీటిలో 1600 ఎకరాలు వ్యవసాయ భూములు కాగా, అధికశాతం భూములు చేపలు, రొయ్యల చెరువులుగానే ఉన్నాయి. భీమవరానికి చెందిన బడాబాబులు ఈ భూముల్లో కొంతమేర రైతుల నుంచి లీజుకు తీసుకుని, పక్కనే ఉన్న అసైన్డ్, ప్రభుత్వ భూములు, డ్రెయినేజీ భూములను ఆక్రమించేసుకున్నారు. ఒక్కో చెరువును 70 నుంచి 150 ఎకరాల విస్తీర్ణంగా చేసి చేపలు సాగు చేస్తున్నారు. ఎన్నికల ముందు బందరు మండలంలోని 11 గ్రామాల్లోని 12 వేల ఎకరాల అసైన్డ్ భూములకు రైతుల పేరుతో పట్టాలు ఇస్తామనే అంశాన్ని వైసీపీ పాలకులు తెరపైకి తెచ్చారు. అప్పట్లో వీఆర్వోలు, సర్వే సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి మండలంలోని భూములను సర్వే చేశారు. పాత భూ రికార్డుల ప్రకారం అసైన్డ్ భూములు ఎవరి పేరుతో ఉన్నాయి? ప్రస్తుతం ఎవరు అనుభవదారులుగా ఉన్నారు? క్రయ, విక్రయాలు జరిగితే ప్రస్తుతం భూమి ఎవరి చేతుల్లో ఉంది? అనే అంశాలపై వివరాలు సేకరించారు. ఎన్నికల ముందు అసైన్డ్ భూములకు పట్టాలిచ్చే అంశం వివాదాస్పదం కావడం, టీడీపీ నాయకులు సమాచార హక్కు చట్టం ద్వారా ఈ వ్యవహారంపై వివరాలు కోరడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. కోన-1, 2 రెవెన్యూ గ్రామాల పరిధిలోని భూములను ఆక్రమించిన భీమవరం బాబులు ఇదే అవకాశంగా తీసుకుని ప్రభుత్వ, అసైన్డ్ భూములకు తామే హక్కుదారులుగా రికార్డులు మార్పించి ఆర్‌వోఆర్‌లో తమపేర్లు నమోదు చేయించుకున్నారు.

పాత పరిచయం కలిసొచ్చి..

ఎన్నికల షెడ్యూలు విడుదలకాక ముందే ఎన్నికల విధుల నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లా నుంచి కృష్ణాజిల్లా బందరు మండలానికి వచ్చిన తహసీల్దార్‌కు భీమవరంలోని బడాబాబులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఇదే అవకాశంగా తీసుకున్న భీమవరం బడాబాబులు చేపలచెరువులుగా సాగుచేస్తున్న భూములకు హక్కుదారులుగా ఆర్‌వోఆర్‌లో పేర్లు నమోదు చేయించుకునేందుకు ప్రయత్నాలు చేసుకున్నారు. తహసీల్దార్ డిజిటల్‌సైన్‌ను ఉపయోగించి భీమవరానికి చెందిన నలుగురి పేరున భూ రికార్డులు మార్చివేసినట్టు రెవెన్యూ అధికారులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఈ నలుగురి చేతుల్లోనే మూడువేల ఎకరాలకుపైగా భూములు ఉన్నాయి. ఎవరికివారు ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో రాత్రికిరాత్రే వందలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూముల రికార్డులను మార్చివేశారనే అంశం కొద్దిరోజుల క్రితమే వెలుగులోకి వచ్చింది.

రికార్డులు మాయం

ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఎవరి పేరునైనా మార్పు చేయాలంటే అసలు భూమి యజమానులు ఎవరు? ప్రభుత్వం వారికి ఎప్పుడు భూములను ఇచ్చింది? అసైన్డ్‌పట్టాలు పొందిన లబ్ధిదారులు సాగుచేసుకుంటున్నారా? వారి వారసులు సాగు చేసుకుంటున్నారా? ఎవరికైనా విక్రయించారా? తదితర అంశాలను పూర్తిస్థాయిలో పరిశీలించి మాన్యువల్‌గా సంబంధిత గ్రామ వీఆర్వో రికార్డులను తయారు చేయాలి. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, డెప్యూటీ తహసీల్దార్ ఈ రికార్డులను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్నట్టు నిర్ధారణ చేసిన తరువాత తహసీల్దార్‌కు ఈ ఫైల్ పంపాలి. ఇలా తయారుచేసిన రికార్డులను, భూమిని ఆర్‌వోఆర్‌లో చేర్చే వరకు ఉంచి, ఆ తరువాత వాటిని మాయం చేశారు. ఎన్నికల సమయంలో కొన్ని రోజులపాటు తహసీల్దార్ కార్యాలయంలోనే బీరువాలకు సీళ్లు వేయడం కూడా చేశారని రెవెన్యూ ఉద్యోగులు చెబుతున్నారు. ఎలాంటి ఆధారాలూ లేకుండా ఆర్‌వోఆర్‌లో కొందరి పేరున భూ హక్కు చట్టం కల్పిస్తూ బందరు తహసీల్దార్ చేసిన ప్రయోగం ఆర్‌డీవో కార్యాలయ అధికారులకు ఎట్టకేలకు చేరింది. దీనిపై తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బందిని పిలిపించి ఇటీవల విచారణ చేశారు. ఆర్‌వోఆర్‌లో భూ యజమానుల పేర్లు చేరుస్తూ తయారుచేసిన రికార్డులు కావాలని ఆర్‌డీవో కార్యాలయ అధికారులు కోరితే ఇవి కనపడటంలేదని సమాధానం చెప్పడం గమనించదగ్గ అంశం.



త్వరలో ఉచిత బస్సు ప్రయాణం

- 1500 కొత్త బస్సుల కొనుగోలుకు నిర్ణయం
- తొలివిడతగా 200 బస్సులు
- ఆర్టీసీ బస్సుల ప్రారంభ సభలో మంత్రి రవీంద్ర

6లో..

డబ్బు వసూళ్లు వద్దు

- వీఆర్వోల అంతరంగిక సమావేశంలో గన్నవరం తహసీల్దార్ వ్యాఖ్యలు
- రైతులకు ఉచితంగా సేవలు అందించాలని ఆదేశాలు
- దళారులకు చెక్‌పెట్టేలా చర్యలు

6లో..

నామినేషన్ టెన్షన్!

పాలఫ్యాక్టరీ ఎన్నికలకు నామినేషన్లు నిల్

- మూడు డైరెక్టర్ల పదవులకు ఎవరూ ముందుకురాని వైనం
- ఒక్క నామినేషన్ కూడా రాకపోవడంపై అనుమానాలు
- ముగిసిన ఎన్నికల ప్రక్రియ.. సర్వత్రా చర్చ
- స్పందించని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్, పాలకవర్గం

చిట్టినగర్, ఆగస్టు 9 : మూడు డైరెక్టర్ల పదవులకు గానూ పాలఫ్యాక్టరీలో శుక్రవారం జరిగిన ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశ్నార్థకంగా మారింది. ముగ్గురు డైరెక్టర్ల పదవులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకుండానే ఎన్నికల ప్రక్రియ ముగిసింది. అయితే, ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నామినేషన్లు వేసేందుకు సొసైటీ అధ్యక్షులు ఎందుకు ముందు రాలేదనేది చర్చకు దారితీసింది. ఇందులో పాలకవర్గం పాత్ర ఉందా? స్వచ్ఛందంగా జరిగిందా? అనేది సందేహంగా ఉంది. ఎన్నికలంటే నామినేషన్లు దాఖలు చేయడమనేది సాధారణం. గడువు ముగిసేలోపు వచ్చిన నామినేషన్లను పరిగణనలోకి తీసుకుని ఏకగ్రీవమా, పోటీ ఉందో, లేదో సూచిస్తారు. కానీ, పాలఫ్యాక్టరీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ట్విస్ట్ చోటుచేసుకుంది.

కృష్ణా మిల్క్ యూనియన్‌లో చర్చ

పాలఫ్యాక్టరీలోని క్షీరదర్శన్ హాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల దాఖలు చేపట్టారు. ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోవడంలో ఎన్నికల అధికారి గురునాథం ఎన్నికల ప్రక్రియ ముగిసినట్లు ప్రకటించారు. దీనిపై కృష్ణా మిల్క్ యూనియన్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. సెప్టెంబరు నెలాఖరు నాటికి కౌతవరం-గుడ్లవల్లేరు క్లస్టర్‌కు చెందిన వీబీకేవీ సుబ్బారావు, చీపురుగూడెం-తిరువూరు క్లస్టర్‌కు చెందిన బొట్టు రామచంద్రరావు, కొండూరు-గుడ్లవల్లేరుకు చెందిన యెర్నేని సీతాదేవి.. మూడు డైరెక్ట్ పోస్టులు ఖాళీ కానున్నాయి. వాటికి సంబంధించి ఈ నెల ఒకటో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. కాగా, ఇప్పటి వరకు పాలఫ్యాక్టరీ చరిత్రలో నామినేషన్లు పడకుండా శుక్రవారం నాటి నామినేషన్ ప్రక్రియ ముగియడం గమనార్హం. ఇంతా జరుగుతున్న పాలకవర్గ చైర్మన్, పాలకవర్గం మిన్నకుండిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



శ్రావణ శుక్రవారం సందర్భంగా క్యూలైన్‌లో భక్తుల రద్దీ

కొండపై శ్రావణ సందడి..

» దుర్గమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

వన్‌టౌన్, ఆగస్టు 9 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకోవటానికి వేకువజామునుంచే భక్తులు తరలివచ్చారు. శ్రావణమాసం శుక్రవారం మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి, ముగురమ్మల మూలపుటమ్మ కనకదుర్గమ్మను దర్శించుకుంటే సుఖశాంతులు, భోగభాగ్యాలతో వర్ధిల్లుతారని నమ్మిక. ఈ క్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో దుర్గమ్మను దర్శించుకున్నారు. క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఈవో ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని పొంగళ్లు సమర్పించారు. పలువురు భక్తులు ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమం, శాంతి కళ్యాణం తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. శుక్రవారం వల్లీ దేవసేన సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద నాగ పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నాగ పంచమి తిథి కావటంతో పుట్టలో పాలుపోసి, సుబ్రహ్మణేశ్వర స్వామికి అర్చనలు చేశారు. విజయవాడ ఆటోనగర్‌లోని దుర్గా ఆటో బాడీ బిల్డర్స్ అధినేత కార్తీక్ ఆర్య శుక్రవారం అన్నవితరణకు రూ.1,35,000లు విరాళం ఆలయ అధికారులకు అందజేశారు.





చల్లపల్లి సెంటర్లో మాట్లాడుతున్న రైతుసంఘం నేతలు

రైతు వ్యతిరేక విధానాలపై సంఘటితంగా పోరాడుదాం

» ఏపీ రైతు సంఘం నేత సురేంద్రనాథ్ బెనర్జీ

చల్లపల్లి, ఆగస్టు 9 : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు నిరసనగా రైతులంతా సంఘటితమై పోరాడాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో తలపెట్టిన క్విట్ కార్పొరేట్ కార్యక్రమం సందర్భంగా శుక్రవారం చల్లపల్లి ప్రధాన సెంటర్లో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వ్యవసాయ చట్టాలతో దేశానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలుచేస్తానని అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఆ మాటను విస్మరించి రైతుల నడ్డివిరిచే చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ వ్యవసాయదారులను కూలీలుగా మార్చేందుకు కుట్ర జరుగుతోందన్నారు. రైతు సమస్యలపై పోరాడేందుకు పార్టీలకతీతంగా రైతుసంఘాల నాయకులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు వేమూరి రత్నగిరిరావు, సీపీఎం నేతలు యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు, మహమ్మద్ కరీముల్లా, వెనిగళ్ల వసంతరావు, రైతు కూలీ సంఘం నేత జన్ను జగన్, సీపీఐ నాయకులు మల్లుపెద్ది బోసు, డొక్కు శ్రీనివాసరావు, అల్లూరి బాబూరావు, సీపీఐ ఎంఎల్ నేత పరుచూరి జనార్దన్, ఈపూరి రాంబాబు, కాంగ్రెస్ నేత మీర్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని కాపాడాలి

» లెనిన్ సెంటర్‌లో రైతు సంఘాల నిరసన

గవర్నర్‌పేట : దేశ సంపద, సహజ వనరులను కొల్లగొడుతు దేశాన్ని పట్టిపీడిస్తున్న బహుళజాతి కంపెనీలను తరిమికొట్టాలని రైతు నేత మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కార్మిక, కర్షక సంఘాల నేతృత్వంలో లెనిన్ సెంటర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం నుంచి బ్రిటిష్ వారిని తరిమి కొట్టేందుకు ఆగస్టు 9న క్విట్ ఇండియా నిర్వహించారని, అదేవిధంగా దేశం నుంచి విదేశీ, స్వదేశీ బహుళజాతి కంపెనీలను తరిమికొట్టాలన్న డిమాండ్‌తో నిరసన కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను శాసిస్తూ బడా కంపెనీల అనుకూల చట్టాలను ప్రభుత్వాలు మార్చడాన్ని తప్పుబట్టారు. పారిశ్రామిక రంగంలో 42 కార్మిక చట్టాలు రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌ల విధానాలను తీసుకురావడాన్ని తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో తీసుకువచ్చిన 4 చట్టాలను రద్దు చేసినప్పటికీ పరోక్షంగా అదే విధానాలను కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ డిమాండ్లను పరిష్కరించలేని పక్షంలో రానున్న రోజుల్లో కార్మిక, కర్షకుల నేతృత్వంలో పెద్ద ఎత్తున మరో ఉద్యమానికి నాంది పలుకుతామని ప్రకటించారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు వై.కేశవరావు, జి.ఈశ్వరయ్య, ఎం.సూర్యనారాయణ, సింహాద్రి ఝాన్సీ, డి.హరినాథ్, చుండూరి రంగారావు, మరీదు ప్రసాద్‌బాబు, బసవయ్య, యం.హరిబాబు, బుడ్డి రమేష్, కార్మిక సంఘాల నేతలు ఆర్.రవీంద్రనాథ్, ఎ.వెంకటేశ్వరరావు, జె.కిషోర్‌బాబు, ఎ.రవిచంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోట కళ్యాణ్, రంగారెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్ : వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం పర్యటించారు. పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద పరిస్థితిపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించిన అనంతరం పాత ఎడ్లంక గ్రామానికి వెళ్లే కాజ్ వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం, మాజీ సర్పంచ్ పీతా వెంకటేశ్వరరావు, మాలమహానాడు అధ్యక్షులు దోవా గోవర్ధన్‌లు వరదల వల్ల ఇబ్బందులను బుద్ధప్రసాద్‌కు తెలిపారు. మండలి స్పందిస్తూ ఎడ్లంక దీవి వాసుల రాకపోకలకు అనువుగా నాబార్డు సాయంతో వంతెన నిర్మిస్తామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, దివి ప్రాంతంలో నదీ గమనంలో అనూహ్య మార్పులు సంభవించాయని, దీనిపై శాస్త్రీయమైన అధ్యాయనం జరగాల్సి ఉండదని తెలిపారు. కార్యక్రమంలో అవనిగడ్డ సీఐ త్రినాథ్, ఎస్‌ఐ శ్రీనివాస్, వీఆర్వో చిన్నారి, వేకనూరు ఆరోగ్య సిబ్బంది, జనసేన నేత రాయపూడి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. కృష్ణానది వరదల కారణంగా ఎడ్లంకకు వెళ్లే ప్రధాన బాట కొట్టుకుపోగా, శుక్రవారం పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ కాజ్‌వే దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. విరాళాలు వేసుకుని తాత్కాలిక కాజ్‌వే ఏర్పాటు చేసుకుంటున్నామని మాజీ సర్పంచ్ పీతా వెంకటేశ్వరరావు తెలిపారు.



పాత ఎడ్లంక వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

త్వరలో ఉచిత బస్సు ప్రయాణం

» 1500 బస్సులు కొనుగోలు చేస్తాం
» తొలివిడతగా 200 బస్సులు
» బస్సులు ప్రారంభించిన మంత్రి రవీంద్ర



జెండా ఊపి ఆర్టీసీ సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9 : ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం ఆర్టీసీ డిపోలో కొత్తగా కొనుగోలు చేసిన ఐదు బస్సులను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 1500 కొత్త బస్సులను కొనుగోలు చేస్తామని, తొలివిడతగా 200 బస్సులు కొనుగోలు చేశామన్నారు. దీనిలో భాగంగా మచిలీపట్నం ఆర్టీసీ డిపోకు ఐదు కొత్త సర్వీసులు అందించామన్నారు. విలీనం పేరుతో జగన్‌రెడ్డి, పేర్ని నాని ఆర్టీసీ ఉద్యోగులను మోసం చేసి అప్పుల పాలు చేశారన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృత నిశ్చయంతో ఉన్నామన్నారు. ఆర్టీసీని బలోపేతం చేసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి వాణిశ్రీ మాట్లాడుతూ, ఐదు బస్సుల్లో రెండింటిని బీహెచ్‌ఈఎల్‌కు, మూడు బస్సులు బందరు-విజయవాడ నాన్‌స్టాప్ సర్వీసులుగా నడుపుతామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజరు పెద్దిరాజు, టీడీపీ నేత గొర్రెపాటి గోపీచంద్, జనసేన నేత బండి రామకృష్ణ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబా ప్రసాద్, లంకే నారాయణ ప్రసాద్, కుంచే నాని, అక్కుమహంతి రాజా, పీవీ ఫణికుమార్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం నివారిస్తాం.. : రవీంద్ర

పోషకాహారలోపం నివారించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కుష్టు రోగులకు మంత్రి పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషకాహార విలువలు గల ఆహారాన్ని ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో లెప్రసీ మెడికల్ ఆఫీసరు వెంకట్రావు, సీఎస్ఆర్ లక్ష్మీనారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్ షెడ్యూల్‌లో మార్పు

రైల్వేస్టేషన్, ఆగస్టు 9 : 20833, 20834 విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్‌లో మార్పుచేశారు. ఈ మేరకు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ అధికారి నుస్రత్ మండ్రూపకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈ రైలు ఆదివారం తప్ప మిగతా ఆరు రోజులు నడుస్తున్నది. దీనిని మంగళవారం తప్ప మిగతా ఆరు రోజులు నడిచేలా షెడ్యూల్ చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నంకు అలాగే విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు మార్చిన షెడ్యూల్ ప్రకారం రైళ్లు నడువనున్నాయి.

పంట పరిహారంలో అవకతవకలపై ఫిర్యాదు

పెడన : మిచౌంగ్ తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం పంపిణీలో అవకతవకలకు పాల్పడిన వ్యవసాయ శాఖ సిబ్బందిపై జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి ఎస్.పద్మావతి క్రిమినల్ కేసు పెట్టించారు. మిచౌంగ్ తుపాను కారణంగా అనర్హులైన 152 మంది నష్టపోయినట్టుగా చూపి వారి ఖాతాలకు రూ. 47.30 లక్షలు జమ చేశారు. దీంతో అర్హులైన రైతులు ఆందోళన చేశారు. అవకతవకలకు కారకులైన పెడన వ్యవసాయ శాఖ ఏవో జీవీ శ్రీనివాసరావు, వీఏఏలు ఎస్.హరిత, మహమ్మద్ తాజ్ అహమ్మద్, కంప్యూటర్ ఆపరేటర్ వై.నాగమల్లేశ్వరరావు, పీపీసీ టెక్నికల్ అసిస్టెంట్ కాగిత సరళలపై పద్మావతి కేసు పెట్టారు. సీఐ నాగేంద్రప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఖోఖో పోటీలో తలపడుతున్న విద్యార్థులు

ముగిసిన నవోదయ క్లస్టర్ క్రీడలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 9 : జవహర్ నవోదయ విద్యాలయ వేలేరు ఆవరణలో నిర్వహించిన క్లస్టర్ లెవెల్ క్రీడా పోటీలు గురువారం రాత్రితో ముగిసాయి. తొమ్మిది జిల్లాలకు చెందిన నవోదయ క్రీడాకారులు ఖోఖో, కబడ్డీ, షటిల్‌బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ తదితర పోటీల్లో హోరాహోరీ గా తలపడ్డారు. అండర్ 14, అండర్ 17, అండర్19 విభాగాల్లో జరిగిన వివిధ క్రీడాంశాల్లో 223మంది విద్యార్థులు రీజనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. తదనంతరం నిర్వహించిన సభలో ఎన్టీ ఫీడ్స్ జనరల్ మేనేజర్ బి.పి. ఇస్సాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రీడాస్ఫూర్తి పెరుగుతుందని విద్యార్థులకు సూచిస్తూ విజేతలను అభినందించారు. వివిధ జిల్లాలకు చెందిన నవోదయ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యదునందన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చంద్రబాబుకు కలెక్టర్ సృజన స్వాగతం

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలెక్టర్ జి.సృజన స్వాగతం పలికారు.

వసూళ్లు వద్దు!

» వీఆర్వోల అంతరంగిక సమావేశంలో గన్నవరం తహసీల్దార్ వ్యాఖ్యలు
» రైతులకు ఉచితంగా సేవలు అందించాలని ఆదేశాలు
» బ్రోకర్లకు చెక్‌పెట్టేలా చర్యలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నాకు డబ్బులు ఇవ్వొద్దు.. ప్రొటోకాల్ కోసం డబ్బులు వసూళ్లు చేయవద్దు.. అంటూ వీఆర్వోల అంతరంగిక సమావేశంలో గన్నవరం తహసీల్దార్ కె.వెంకటశివయ్య వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే తహసీల్దార్‌గా శివయ్య బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్‌ఓ)తో శుక్రవారం శివయ్య అంతరంగిక సమావేశాన్ని నిర్వహించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసిన నేపథ్యంలో, గత ప్రభుత్వంలో రైతులు పాస్‌బుక్‌లు, ఇతర సేవలకు సంబంధించి ఎదుర్కొన్న సమస్యలను శివయ్య దృష్టికి తెచ్చారు. అనంతరం వీఆర్వోలతో అంతరంగిక సమావేశంలో తహసీల్దార్ శివయ్య వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైంది. రైతులకు పట్టాదారు పుస్తకాలను ఉచితంగా అందజేయాల్సిందిగా ఆదేశించారు. వారి నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోవద్దని గట్టిగా చెప్పారు. ప్రొటోకాల్ పేరుతో ఎలాంటి వసూళ్లు చేయవద్దని నిర్దేశించారు. ఎవ్వరూ తనకు ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన పని లేదని చెప్పారు. లంచాలు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని బ్రోకర్ల కేంద్రంగా మార్చివేశారని, ఇకపై సహించేది లేదన్నారు.



తెంపల్లికి సంబంధించి నెల రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ కేసు

ప్రైవేటు వ్యక్తుల పెత్తనం..

గతంలో ఏ తహసీల్దార్ ఇలా చెప్పలేదని వీఆర్వోలంతా చర్చించుకోవటం గమనార్హం. ఐదేళ్లుగా వీఆర్వోలు ఉత్సవ విగ్రహాలుగా పనిచేయాల్సి వచ్చేది. ప్రైవేటు వ్యక్తుల పెత్తనం నడిచేది. గన్నవరం తహసీల్దార్ కార్యాలయంలో చాలాకాలంగా దళారుల రాజ్యం నడుస్తోంది. పట్టాదారు పాసుపుస్తకాలకు బ్రోకర్లు వేలాది రూపాయలను వసూలు చేసేవారు. పాసు పుస్తకం ఇవ్వాలంటే ఎకరానికి రూ. 10 వేల చొప్పున వసూలు చేసేవారు. మ్యుటేషన్ల కోసం అక్రమ వసూళ్లు చేసేవారు. ప్రైవేటు వ్యక్తులు నేరుగా తహసీల్దార్లతో చేతులు కలిపి ఈ తతంగాన్ని నడిపించేవారు. నాటి వైసీపీ నేత ముఖ్య అనుచరులకు కొంత వాటాలు చెల్లించేవారు. ఇప్పటికీ భారీ సంఖ్యలో పాసుపుస్తకాలు ఆర్ఐ టేబుల్ మీద ఉన్నాయి. దీనికి ఉదాహరణ తెంపల్లి కేసులో భర్త చనిపోతే మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేయగా.. నెల రోజులకు పైగా పెండింగ్‌లో ఉంది. కొత్త తహసీల్దార్ ఈ పెండింగ్ ఫైల్స్ బూజు దులపాల్సి ఉంది.

గిరిజనులను ఆదుకుంటాం

» ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, తదితరులు

మచిలీపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గిరిజనులను అన్ని విధాల ఆదుకుంటామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం జిల్లాస్థాయి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాడేరు సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా చూశానన్నారు. అరకు కాఫీ, సంబంధిత ఉత్పత్తులను విక్రయించుకునేందుకు కో-ఆపరేటివ్‌సొసైటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం గిరిజనుల సంక్షేమకోసం పనిచేస్తోందని, సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి అందరికీ ఆధార్‌కార్డులు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరరావు మాట్లాడుతూ, గిరిజనుల పట్ల ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే, పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నూజివీడు ట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జ్యోతిలాల్ నాయక్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం జీవో నెంబరు 52ద్వారా ఆర్థికంగా, రాజకీయంగా బలంగా ఉన్న బీసీ ఉపకులాలను ఎస్టీలలో కలిపేందుకు ప్రయత్నం చేసిందన్నారు. ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈసందర్భంగా 10మంది గిరిజనులకు హౌసింగ్‌స్కీం ద్వారా రూ.6.30లక్షల చెక్కును కలెక్టర్ అందజేశారు. విద్యలో రాణిస్తున్న గిరిజన విద్యార్థులను సత్కరించారు. ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, గిరిజన సంక్షేమశాఖ అధికారి బి ప్రకాశరావు, పర్యాటకశాఖ అధికారి జి.రామకృష్ణారావు, గిరిజన కళాశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణమోహన్, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



జాతీయజెండాను చేతబూనే కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ బాలాజీ

ఉద్యమ నేతల స్ఫూర్తిని స్మరించుకుందాం : కలెక్టర్

మచిలీపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : భారత స్వాతంత్ర్య ఉద్యమనేతల స్ఫూర్తిని స్మరించుకోవడంతోపాటు, జాతీయభావాన్ని, ఐకమత్యాన్ని ప్రతిఒక్కరూ అలవరచుకోవాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జాతీయజెండాను చేతబూనే కార్యక్రమాన్ని కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిఉద్యోగి పాల్గొనాలని సూచించారు. ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోగా 35వేల గృహాలు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, పాల్గొన్న అధికారులు

మచిలీపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, గృహనిర్మాణశాఖలోని ఉద్యోగులు, అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గృహ నిర్మాణసంస్థ ఆధ్వర్యంలో స్థానిక గోల్డ్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం జిల్లాలో గృహనిర్మాణంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 100 రోజుల్లో ఐదు వేల గృహాలను నిర్మాణం చేయాలని, ఏడాది వ్యవధిలోగా 35వేల గృహాల నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టారన్నారు. ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు డివిజన్, మండలస్థాయి అధికారులు, సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సక్రమంగా పనిచేయాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. డ్వాక్రా సభ్యుల గృహనిర్మాణం నిమిత్తం రుణాలు మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఒక్కో గృహానికి 90రోజుల పనిదినాలకు కల్పించి, లబ్ధిదారులకు వేతనం రూపంలో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహనిర్మాణసంస్థ పీడీ జీవీ సూర్యనారాయణ జిల్లాలో గృహ నిర్మాణసంస్థ ప్రగతిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో గృహనిర్మాణసంస్థ ఈఈలు, డీఈలు, ఏఈలు, వర్క్‌ఇనస్పెక్టర్లు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డ్వామా, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లు సిద్ధం చేయండి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన పిలుపు

కృష్ణలంక, ఆగస్టు 9 : నిరుపేదలకు తక్కువ ధరకే భోజనాన్ని అందించే అన్న క్యాంటీన్లను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను లాంఛనంగా ప్రారంభిస్తున్న దృష్ట్యా నగరంలో క్యాంటీన్ల నిర్వహణ పనులను శనివారం నాటికి పూర్తిచేసి సిద్ధం చేయాలన్నారు. దీనిలో భాగంగా వన్‌టౌన్ గాంధీ పార్కు వద్ద, అలంకార్ ధర్నాచౌక్ వద్ద అన్న క్యాంటీన్లను శుక్రవారం కలెక్టర్ సృజన, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్ల ద్వారా నిరుపేదలకు నాణ్యమైన ఆహారాన్ని రూ.5కే అందించనున్నారన్నారు. క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో రాజీ పడకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించే విధంగా సిద్ధం చేయాలన్నారు. ప్రతి రోజు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం మూడుపూటలా అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.15 లకే లభ్యంకానున్నదన్నారు. ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.



అన్న క్యాంటీన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

కూటమి పాలన చూసి ఓర్వలేక

» జగన్‌పై దేవినేని ఉమా ఫైర్

గొల్లపూడి, ఆగస్టు 9 : కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అరుపులు పెడబొబ్బలు పెడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఆయన గొల్లపూడిలో విలేకర్లతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో కూర్చునే దమ్ము ధైర్యం లేక తాడేపల్లి కొంపలో కూర్చొని మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. ప్రతిపక్ష హోదా కావాలని, సీఎం సెక్యూరిటీ కావాలని కోర్టులో కేసులు వేసిన జగన్ రెడ్డి నేడో రేపో ముఖ్యమంత్రి పదవి కావాలని వేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. ఆయన చర్యలే ఆయన మానసిక పరిస్థితికి అద్దం పడుతున్నాయన్నారు. 36 హత్యలు జరిగాయంటాడు.. ఒక్క దానికి ఆధారం ఉండదు. రోత పత్రిక, సోషల్ మీడియాలో విషప్రచారం మాత్రం ఆపడం లేదన్నారు. జగన్ తీసుకున్న అహంకారపు మూర్ఖపు నిర్ణయాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలు జెండా పీకేస్తున్నారన్నారు. తన బాబాయ్ హత్య కేసులో ఫోన్ డేటా కాల్ లిస్టు సీబీఐకి, కోర్టుకు ఇచ్చే ధైర్యం ఉందా జగన్ అని ప్రశ్నించారు.

కట్న వేధింపులు.. భార్యపై దాడి



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9 : మచిలీపట్నం భాస్కరపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అదనపు కట్నం కోసం ఆమె భర్త కిరాతకంగా కొట్టడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భాస్కరపురానికి చెందిన స్వర్ణకు, హైదరాబాద్‌కు చెందిన వెంకట రోహిత్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. రోహిత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే మరో కంపెనీలో స్వర్ణ పనిచేస్తోంది. పెళ్లయిన నాటి నుంచి భర్త, అత్తలు అదనపు కట్నం కోసం వేధించడం, పుట్టింటికి వెళ్లిపోమని బెదిరించేవారు. ఒక రోజు ఉద్యోగానికి వెళ్లి తిరిగి వచ్చిన స్వర్ణ ఆమె భర్త, అత్తలు ఇల్లు ఖాళీ చేసి వేరే చోటకు వెళ్లిపోవడంతో ఖంగుతింది. నాటి నుంచి భర్తతో కాపురం చేసేందుకు స్వర్ణ శాంతియుత పోరాటం చేస్తోంది. ఈ నేపథ్యంలో స్వర్ణ దిశ పోలీసులను ఆశ్రయించింది. ఇదిలా ఉంటే మచిలీపట్నంలో బంధువుల ఇంటికి వచ్చిన భర్త, అత్తలు శుక్రవారం స్వర్ణను తీవ్రంగా గాయపరిచారు. బాధితురాలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించింది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్ బైక్‌లు

బైక్ దొంగలు దొరికారు

వీరులపాడు : వీరులపాడు మండలం జుజ్జూరు, అల్లూరు గ్రామానికి చెందిన ఆరుగురు మైనర్ బాలురు ముఠాగా ఏర్పడి ఇళ్ల ముందు ఉంచిన మోటార్ బైక్‌లను తస్కరిస్తూ ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డారు. శుక్రవారం ఏసీపీ రవికిరణ్ విలేకర్లతో మాట్లాడుతూ, చెడు వ్యసనాలకు బానిసై డబ్బు కోసం వక్ర మార్గం ఎంచుకున్న ఆరుగురు మైనర్లు మోటార్ బైక్‌లు తస్కరిస్తున్నారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో స్థానిక ఎస్సై లక్ష్మణుడు, సిబ్బందితో కలిసి నిందితులను పట్టుకుని, వారి నుంచి 10 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఇసుక తరలిస్తూ..



జగ్గయ్యపేట రూరల్ : రామచంద్రునిపేట గ్రామ సరిహద్దులో తెలంగాణాలోకి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని చిల్లకల్లు పోలీసులకు అప్పగించినట్టు ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి తెలిపారు. శుక్రవారం సాధారణ తనిఖీలలో భాగంగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో పరిశీలించగా అనుమంచిపల్లి స్టాకు యార్డు నుంచి రామచంద్రునిపేటకు వే బిల్లు తీసుకుని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అప్పలనర్సాపురం గ్రామానికి తరలిస్తున్న ఐదు టన్నుల ఇసుకట్రాక్టర్, ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ పేరం అఖిల్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. పోల్డా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	92, 101, 112
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.30

విద్యార్థినులకు బస్‌పాస్‌లు అందజేత



ఉయ్యూరు, ఆగస్టు 9 : ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థినులకు పూర్వ విద్యార్థులు బస్‌పాస్‌లు శుక్రవారం అందజేశారు. 1988-89 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు, ఆంధ్రాబ్యాంకు రిటైర్డు ఉద్యోగి ఎంవీ ఎస్ మూర్తి ఆర్థిక సాయంతో విద్యార్థినులకు ఉచిత బస్‌పాస్‌లు అందజేశారు. గఫార్, వెంకట శివన్నారాయణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీ

ఉయ్యూరు, ఆగస్టు 9 : ఉయ్యూరు పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. రెండు స్టేషన్లలోపల, పరిసరాలు చూసి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పట్టణస్టేషన్‌లోపల విద్యుత్‌వైర్లు గోడకు వేలాడుతూ ఉండటం గమనించి బాగు చేయించడని సీఐ రామారావుకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కంకిపాడు, ఆగస్టు 9 : మద్దూరు కరకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వణుకూరుకు చెందిన గద్దె శ్రీనివాసరావు (42) మద్దూరు కట్టపై పొలం పనులకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై సందీప్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

గన్నవరం డీఎస్పీగా శ్రీనివాసరావు

గన్నవరం, ఆగస్టు 9 : గన్నవరం డీఎస్పీగా చలసాని శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించనున్నారు. గతంలో విజయవాడ సీసీఎస్‌లో ఏసీపీగా పనిచేసి బదిలీపై ఒంగోలు దిశా స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఐదు నెలలు పనిచేశారు. గన్నవరం డీఎస్పీ జయసూర్య బదిలీపై వెళ్లడంతో ఆ స్థానంలో ఒంగోలులో పనిచేస్తున్న చలసాని శ్రీనివాసరావును గన్నవరం డీఎస్పీగా బదిలీ చేస్తూ డీజీపీ ద్వారక తిరుమలరావు ఆదేశాలు జారీ చేశారు.

మాదు వసంతరావుకు నివాళి



వసంతరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, ఆగస్టు 9 : పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరితో కలిసి ఉండే వ్యక్తి, అజాత శత్రువు వసంతరావు అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, ప్రస్తుత వైసీపీ నాయకుడు మాదు వసంతరావు శుక్రవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం ఉదయం వసంతరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉయ్యూరు, ఆగస్టు 9 : నందమూరు 33 కేవీ ఫీడరుకు మెయింటెనెన్స్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుం చి 11 గంటలవరకు కాటూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. కాటూరు, రాజుపేట, కలవ పాముల, కడవకొల్లు, పొట్లపాడు, వీరవల్లిమొఖాస గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీసీపీడీసీ ఎల్ ఉయ్యూరు డీఏఈ డి. కృష్ణనాయక్ తెలిపారు.

గన్నవరం : దావాజీగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను శనివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకూ నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకట రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పామర్తినగర్, రాజీవ్ నగర్ కాలనీ, ఎస్‌టీబీఎల్, మల్లికార్జున స్కూల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక



ఉయ్యూరు, ఆగస్టు 9 : ఉయ్యూరు పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన టీవీవీ రామారావుకు టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు యెనిగళ్ల కుటుంబరావు, పార్టీ నాయకుడు కాగిత కొండ శుక్రవారం పట్టణ స్టేషన్‌లో ఆయనను కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధికార ప్రతినిధి కొండా ప్రవీణ్, వెలగపూడి వెంకన్న సీఐని కలసి శుభాకాంక్షలు తెలిపారు.

గాడిలో పెట్టేనా?

● సర్కిల్ పరిధిలో పెచ్చరిల్లిన గంజాయి, పేకాట, కోడి పందేలు
● సెటిల్‌మెంట్లతో మసకబారిన పెనమలూరు స్టేషన్ ఖ్యాతి
● సిబ్బంది తీరుపై సర్వత్రా విమర్శలు
● కొత్త సీఐకి సవాళ్ల స్వాగతం



పెనమలూరు, ఆగస్టు 9 : కృష్ణాజిల్లాలోనే అతిపెద్ద పెనమలూరు పోలీసుస్టేషన్‌కు నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన జే వెంకటరమణకు స్టేషను పరిధిలో పలు సవాళ్లు పొంచి ఉన్నాయి. స్టేషనులో రోజువారీ కార్యకలాపాలు నిర్వహణతో పాటు సిబ్బందిపై స్వీయ నియంత్రణ తెచ్చుకోవాల్సి ఉంది. గత సీఐల హయాం లో సిబ్బందిపై నియంత్రణ లేక పోవడంతో స్టేషనులోనే ఇతర సిబ్బందికి, బయట వ్యక్తులకు మహిళా సిబ్బంది వడ్డీకి డబ్బులు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. గతంలో పని చేసిన ఇన్‌స్పెక్టర్లు అందరూ వైసీపీ ప్రభుత్వానికి అంటకాగిన వారనే అపవాదును మూటకట్టుకున్నారు. ఏడాదిన్నర క్రితం పోరంకిలో జరిగిన బాలిక అనుమానాస్పద మృతి విషయంలో కేసును తప్పుదోవ పట్టించి అప్పటి సీఐ గోవిందరాజులు వీఆర్‌కు వెళ్లారు. తర్వాత వచ్చిన సీఐ కిషోర్ యనమలకుదురు డొంకరోడ్డులో జరిగిన యువకుడు రఫీ హత్యకేసులో నిర్లిప్తంగా ఉన్నారనే విషయంలో సస్పెన్షన్‌కు గురయ్యారు. గతంలో పనిచేసిన ఎస్సైలు యనమలకుదురు డొంకరోడ్డు, కరకట్ట వెంట అక్రమ ఇసుక దందాల్లో మునిగి తేలారనే విషయాల్లో పలు ఆరోపణలు ఎదుర్కొని బదిలీ అయ్యారు. గంజాయి విక్రయదారులతో ములాఖతై వారి నుంచి సొమ్ములు తీసుకొని గంజాయిని ప్రోత్సహించారనే ఆరోపణలతో బదిలీ అయిన సందర్భాలు ఉన్నాయి. గంజాయి విక్రేత అయిన ఒక యువకుడి వద్ద స్టేషనుకు సంబంధించిన ఒక ఎస్సై స్వాధీనం చేసుకొన్న యాపిల్ సెల్‌ఫోన్ తిరిగి ఇవ్వడానికి ముప్పైవేల రూపాయలు వసూలు చేసిన విషయం బయటకు పొక్కడం స్టేషనుకు పెద్ద తలనొప్పిగా మారి ఎస్సైకు సీఐ క్లాసు తీసుకున్నారు. గత సీఐ టీవీవీ రామారావు హయాంలో వైసీపీ ప్రభుత్వంలో ఏకపక్షంగా వైసీపీ ప్రభుత్వ పెద్దల సూచనలతోనే స్టేషనులో కార్యకలాపాలు ఉండేవని ప్రజలు చర్చించుకొనేవారు.

గంజాయి, పేకాట, కోడిపందేలను నియంత్రించేనా..?

తాడిగడప మునిసిపాలిటీ యనమలకుదురు, కానూరు, పోరంకి శివారు, తాడిగడప డొంకరోడ్డులో దారితప్పిన యువత గంజాయికి బానిసలై ఎక్కడి నుండో వచ్చి స్థానిక ప్రదేశాల్లో గంజాయి తాగుతూ, విక్రయాలు చేస్తూ అసాంఘికంగా ప్రవర్తిస్తున్నారనే ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. గంజాయి విక్రేతలు, వినియోగదారుల వివరాలు రికార్డుల్లో ఉన్నాయి. వారితో కుమ్మక్కై సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. నూతన ప్రభుత్వం గంజాయి తదితర మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాలపై ఉక్కుపాదం మోపడంతో కాల్వ కట్టల వెంట, కరకట్ట వెంట గంజాయి వినియోగదారులను అరికట్టే బాధ్యతను పటిష్టంగా నిర్వహించాల్సి ఉంది. యనమలకుదురు కృష్ణానదిలో కొన్ని శాశ్వత స్థావరాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తున్నారని తెలిసినా వసూళ్లకు అలవాటు పడి వారి పట్ల పోలీసులు ఉదాసీనంగా ఉన్నారనే ఆరోపణలు మూటకట్టుకున్నారు. సంఘ విద్రోహశక్తులకు, ఇసుక అక్రమ రవాణాదారులకు చెక్ పెట్టేందుకు యనమలకుదురు శివాలయం వద్ద పోలీసు అవుట్‌పోస్టు ఏర్పాటుతో ఇసుక అక్రమార్కుల వద్ద నుంచి వసూళ్లు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. స్టేషను పరిధిలోని బార్లు ఇరవైనాలుగు గంటలూ మద్యం అమ్ముతూ పేదల, మందుబాబుల జేబుకు చిల్లులు పెడుతుండం, స్టేషనుకు ప్రతి బారు నుండీ ఇరవై వేలకు తక్కువ కాకుండా పోలీసులు నెలవారి మామూళ్లు వసూలు చేయడం..ఇలా అక్రమదందాలు, అనేక ఆరోపణలు ఉన్న పెనమలూరు స్టేషనులో నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణ మున్ముందు ఎలా వ్యవహరిస్తారనే దానిపై స్టేషను పరిధిలోని ప్రజలు చర్చించుకుంటున్నారు.

30 పడకల ఆసుపత్రిగా బాపులపాడు పీహెచ్‌సీ

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



బాపులపాడు పీహెచ్‌సీ ఆవరణలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 9 : బాపులపాడు పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా మార్చడానికి తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శుక్రవారం బాపులపాడు పీహెచ్‌సీ ఆవరణలో 2022లో మంజూరైన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (రక్త పరీక్షలు కేంద్రం) భవన నిర్మాణానికి యార్లగడ్డ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్థానిక విజయవాడ రోడ్డులో డాక్టర్ పెద్దిబోయిన శివరామకృష్ణ నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైవేట్ ఆసుపత్రిని యార్లగడ్డ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీనియర్ డాక్టర్ వైసీపీ నేత దుట్టా రామచంద్రరావు బాపులపాడు పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా మార్చితే పేద ప్రజలకు ఉపయోగపడుతుందని యార్లగడ్డ దృష్టికి తెచ్చారు. మల్లవల్లి పారిశ్రామిక వాడకు మళ్లీ పూర్వ వైభవం వస్తుందన్నారు. ఈ కార్యక్రమా ల్లో విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజ నేయులు, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చల మలశెట్టి రమేష్‌బాబు, టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, గుండపనేని ఉమా వరప్రసాద్, వేములపల్లి శ్రీని వాసరావు, ఆళ్ల గోపాలకృష్ణ, కాకాని బాబు, సుంకర సుభాష్‌చంద్రబోస్, వేగిరెడ్డి పాపారావు, చింతల వెం కట శివఅప్పారావు, సర్పంచ్ సరిపల్లి కమలాబాయి, బాపులపాడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి మంజూషా, తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేసే వారికి గుర్తింపు



తెలంగాణా పంచాయతీరాజ్ చాంబర్ నాయకులను సత్కరిస్తున్న వైవీబీ

ఉయ్యూరు, ఆగస్టు 9 : రాజకీయాల్లో కష్టపడి చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రతిఫలం పదవుల రూపంలో వస్తుందని ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. తెలంగాణా రాష్ట్రానికి చెందిన నాయకులు శుక్రవారం రాజేంద్రప్రసాద్‌ను ఆయన నివాసం లో కలిశారు. గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వర రావు, పొల్యూషన్ బోర్డు మెంబరు, తెలంగాణా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, చాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేంద్ర, కాంగ్రెస్ నాయకుడు భీమ్ భరత్ రాజేంద్రప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలవగా వారిని ఘనంగా సత్కరించారు.

కాకులపాడు చానల్‌కు అనధికారిక పైప్‌లైన్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 9 : వర్షాలతో జలాశయాలు నిండుకుండల్లా ఉన్నా కాలువలకు తగిననీరు వదలకపోగా రైతులు కలిసి బాగుచేసుకున్న కాకుల పాడు చానల్ గట్టు తవ్వి అనధికారికంగా పైప్‌లైన్ ఏర్పాటు చేసుకున్నా జలవనరులశాఖ అధికారులు పట్టించుకో వడం లేదని కాకులపాడు, రంగయ్యప్పారావుపేట, దంటగుంట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువ బాగు చేసినా నీరు సక్రమంగా రాకపోవడంతో శుక్రవారం రైతులు కాలువ వెంబడి పరిశీలించగా కానుమోలు వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన పైప్ లైన్ వెలుగు చూసింది. లక్షల వ్యయంతో పటిష్టం చేసిన గట్టును తవ్వి పైప్‌లైన్ ఏర్పాటు చేయడమే కాకుండా కనబడకుండా చెత్తతో కప్పివేసి ఉండటాన్ని రైతులు గమనించి తవ్వి వెలికితీశారు. దీనిపై జలవనరులశాఖ అధికారులకు, కళానీకి ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎటువంటి చర్యలు చేపట్టకపోగా కనీసం ఘటనా స్థలాన్ని పరిశీలించేందుకు కూడా రాకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పెదఅవుటపల్లిలో విషజ్వరాలు



బ్లీచింగ్ జల్లుతున్న పంచాయతీ సిబ్బంది

ఉంగుటూరు, ఆగస్టు 9 : మండలంలోని పలుగ్రామాల్లో వైరల్‌ఫీవర్లు విజృంభిస్తున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్‌సర్వేలలో సాధారణ జ్వరాలతోపాటు విషజ్వరాలు బయటపడుతున్నాయి. ముఖ్యంగా మేజర్ గ్రామపంచాయతీ అయిన పెదఅవుటపల్లిలో పారిశుధ్యలోపం, కలుషిత తాగునీటి సరఫరా కారణంగా విషజ్వరాలు వ్యాప్తిచెందుతున్నాయి. గామంలో సుమారు 50మందికి పైగా మంచం పట్టారు. తంబినగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో గుర్తించిన 20మంది జ్వరపీడితుల్లో ఐదుగురికి టైఫాయిడ్ నిర్ధారణ కావడంతో అప్రమత్తమైన పంచాయతీ, వైద్యఆరోగ్యశాఖ అధికారులు వైరల్‌ఫీవర్ల కట్టడికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కరీముల్లా మొహీనుద్దీన్, డాక్టర్ సుజిత ఆధ్వర్యంలో హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖరరావు గ్రామంలోని నాలుగు ప్రైవేటు మినరల్‌వాటర్(ఆర్వో)ప్లాంట్లలో నీటిని పరీక్షించగా, అందులో ఒక ఆర్వో వాటర్ ప్లాంట్ ద్వారా కలుషిత తాగునీరు సరఫరా అవుతుందని గుర్తించారు. టైఫాయిడ్‌కు ఆ నీరే కారణంగా భావించి వెంటనే ఆ ప్లాంటును అధికారులు మూసివేయించారు.



గన్నవరంలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి

సేవ్ ఇండియా-సేవ్ అగ్రికల్చర్ అంటూ ప్రజా సంఘాల నిరసన

గన్నవరం, ఆగస్టు 9 : కేంద్ర ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక విధానాలను మానుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి అన్నారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో సేవ్ ఇండి యా-సేవ్ అగ్రికల్చర్ అంటూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణస్వామి మాట్లాడుతూ, మోదీ విధానాల వల్ల వ్యవసాయరంగానికి తీరని నష్టం కలుగు తుం దన్నారు. రైతులను నిలువున ముంచేశారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా నాయకుడు కళ్లం వెంకటేశ్వరావు మాట్లాడుతూ, కార్మికులను బీజేపీ ప్రభుత్వం తీవ్ర మోసం చేసిందన్నారు. ప్రజా సంఘాల నాయకులు వై.నరసింహారావు, మల్లంపల్లి ఆంజనేయులు, సూరగాని సాంబశివరావు, ఆవుటపల్లి సాంబయ్య, మిరపా నాగేశ్వరరావు, చెరువు గట్టు ప్రసాద్, మాదిరెడ్డి చిన్న పాల్గొన్నారు.

ఉంగుటూరు : క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై ప్రజలందరూ ఉద్యమించాలని కౌలురైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణస్వామి పిలుపునిచ్చారు. కౌలు, వ్యవసాయ కార్మిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం క్విట్ కార్పొరేట్ అనే నినాదంతో ఉంగుటూరు సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజ్మీర్ వెంకటేశ్వరరావు, కడవకొల్లు రామరాజు, మా తంగి సంతోష్‌కుమార్, భీమవరపు సుబ్బారెడ్డి, మాగంటి సాంబశివరావు, వాసు, విష్ణు, మీరావలి కే.బికారి, సలీం, పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బుద్ధదేవ్ భట్టాచారికి నివాళి..

పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచారి అకాలమరణానికి చింతిస్తూ ఉంగుటూరులోని కామ్రేడ్ మానికొండ సూర్యావతి శ్రామిక భవనంలో సీపీఎం నాయకులు ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా భట్టాచారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

ఉయ్యూరు : రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సీఐటీయు నాయకుడు పడాల లక్ష్మణరావు అన్నారు. రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఉయ్యూరు సెంటర్‌లో ప్రదర్శన చేశారు. రైతులు పం డిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మికు లకు సంక్షేమ బోర్డు ద్వారా ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు. రైతు సం ఘం నాయకులు అన్నే సుబ్బారావు, సీఐటీయు నాయకుడు బి.రాజేశ్, మహిళా సంఘం నాయకురాలు బి. కీర్తి, తిరుపతయ్య, తిరువీధుల రమేశ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో ప్రజాసంఘాల నిరసన ప్రదర్శన

చెత్త నిర్వహణతోనే పరిశుభ్రత



మాట్లాడుతున్న ఎంపీడీవో రత్నకుమారి

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 9 : గ్రామాల్లో చెత్త నిర్వహణపై ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన ఉన్నపుడే గ్రామాల్లో పరిశుభ్రతకు అవకాశం ఉంటుందని బాపులపాడు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో కె.రత్నకుమారి అధ్యక్షతన గ్రామ ప్రణాళికపై మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మూడు రోజులు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చెత్త సేకరణ- నిర్వహణపై అవగాహన కల్పించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ షకీల్ అహ్మద్ తాగునీటి నిర్వహణ, సురక్షిత తాగు నీటిని ఏవిధంగా ప్రజలకు సరఫరా చేయాలన్న అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు చాగంటిపాటి అంజనేయులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



గన్నవరం, ఆగస్టు 9 : పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ సంప్రదాయ ప్రకారం అమ్మవారికి శ్రావణమాస తొలి పూజను బీసీ, ఎస్సీ, యాదవ, గౌడ, సగర, రజక ప్రతినిధులతో జరిపారు. ఆలయ ప్రాంగణంలోని మానుకు భక్తులు పొంగళ్లు సమర్పించటంతో పాటు పూజలు నిర్వహించారు. అనంతరం సత్యసాయి సేవా సమితి, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను జరిపారు. గ్రామానికి చెందిన 108 మంది సువాసినిలు పాల్గొని భక్తి శ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిగింది. సాయంత్రం లక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామికి ప్రత్యేక పూజలు, శ్రీలక్ష్మీ సహస్రనామ పూర్వక కుంకుమార్చనలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, చిమట శ్రీనివాసరావు, మోదుగుమూడి వేణుగోపాలరావు, అల్లాపురం శంకర్, పడమట సుబ్రమణ్యం, ఈడె సుబ్బారావు, జమలయ్య, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ నిర్వాహకుల అరెస్టు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 9 : చీట్టీలు పాడుకున్న వారికి కోట్లాది రూపాయలు ఎగనామం పెట్టి పరారైన స్థానిక శ్రీలక్ష్మీవేంకటేశ్వర చిట్ ఫండ్స్ నిర్వాహకులు తురకా పుల్లయ్య, ఆయన కుమారుడు అశోక్‌రాజులను ఎస్సై జనార్దన్ శుక్రవారం అరెస్టు చేశారు. ఉపాధ్యా సంఘ నేత, విశ్రాంత ఉపాధ్యాయుడు తురకా పుల్లయ్య తన కుమారుడు అశోక్‌రాజుతో కలిసి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురు వీధిలో సుదీర్ఘకాలంగా శ్రీలక్ష్మీవేంటేశ్వర చిట్ ఫండ్స్‌ను నిర్వహించారు. తనతో పాటు పనిచేసిన ఉపాధ్యా యులు, బంధు మిత్రులు చేత పుల్లయ్య మాష్టారు చిట్‌లు కట్టించారు. పాడుకున్న వారికి, చిట్టీలు కట్టిన వారికి దాదాపు రూ.10 కోట్లు చెల్లించకుండా తాత్సారం చేస్తూ గత నాలుగు నెలల క్రితం చిట్ ఫండ్ బోర్డు తిప్పేసి తండ్రీ కొడుకులు పరారయ్యారు. బాధితులు గత ఏప్రిల్‌లో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు నిందితులిద్దరిని గురువారం అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం నూజివీడు కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించినట్లు ఎస్సై తెలిపారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	92, 101, 112
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188



నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ.4.30

నాగాయలంక - రేపల్లె ఆర్టీసీ బస్సును మార్చాలి

నాగాయలంక, ఆగస్టు 9: నాగాయలంక- రేపల్లె ఆర్టీసీ బస్సుగా కాలం చెల్లినదానిని వినియోగిస్తున్నారని, ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడకుండా, తక్షణం దానిని మార్చాలని దివి వినియోగదారుల పరిరక్షణ మండలి డిమాండ్ చేసింది. మండలి అధ్యక్షుడు లకనం నాగాంజనేయులు శనివారం విలేకరులతో మాట్లాడారు. కొంతమంది ప్రయాణికుల ఫిర్యాదు మేరకు తాను బస్సులో ప్రయాణించి చూశానని, బస్సులో కొన్ని సీట్లు లేవని, ఉన్న సీట్లలో కొన్ని కూర్చోవటానికి వీలుగా ఉన్నాయని, కండక్టర్ సీటు ముందు రాడ్డు లేదని నాగాయంజనేయులు తెలిపారు. బస్సు నడిచేడప్పుడు పెద్ద శబ్దాలతో ఊగుతోందన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకురాలి దుర్మరణం

చల్లపల్లి, ఆగస్టు 9: జాతీయ రహదారిపై చల్లపల్లి పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని యాచకురాలు మృతి చెందింది. యాచకురాలి కాలు నుజ్జునుజ్జుగా మారి, తల ఛిద్రమైంది. వాహనం వేగంగా ఢీకొట్టి వెళ్లి ఉంటుందని భావిస్తున్నారు. చల్లపల్లి సీఐ సీహెచ్ నాగప్రసాద్, ఎస్ఐ సీహెచ్ చిన్నబాబు, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి సంఘటనా ప్రదేశానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచాయతీ కార్మికుల సహకారంతో మృతదేహాన్ని అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి శవపరీక్ష కోసం తరలించారు. వీఆర్వో చల్లపల్లి దుర్గాప్రసాద్ శవపంచనామా నిర్వహించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మృతి

పెడన, ఆగస్టు 9: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యవసాయ కూలీ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పట్టణంలోని 21వ వార్డుకు చెందిన వ్యవసాయ కూలీ పామర్తి ప్రేమ్‌కుమార్(30) మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 2న తల్లి, భార్య గట్టిగా మందలించడంతో మద్యంలో గడ్డి మందు కలుపుకొని తాగాడు. బంధువులు అతడిని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి ప్రేమ్‌కుమార్ మృతి చెందాడు. భార్య నాగదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

మోపిదేవి, ఆగస్టు 9: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేస్తున్న పంట వివరాలను రైతులు విధిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏడీఏ జయప్రద సూచించారు. శుక్రవారం కొక్కిలిగడ్డలో ఈ-క్రాప్ నమోదును ఆమె పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదుతో రైతులు ధాన్యాన్ని సులభంగా అమ్ముకోవచ్చని, బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకోవచ్చని తెలిపారు. ఏవో హెప్సిబారాణి పాల్గొన్నారు.

పామర్రు: ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని రైతులకు మండల వ్యవసాయ అధికారి వి.శివనాగరాణి సూచించారు. పెదమద్దాలి, బల్లిపర్రు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును శుక్రవారం ఆమె పరిశీలించారు. పెదమద్దాలి వీఏఏ శేఖర్, దాస్ పాల్గొన్నారు.

ఆర్‌పేట సీఐగా ఏసుబాబు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9: ఆర్‌పేట సీఐగా ఏసుబాబును నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం సీఐగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్‌ను వీఆర్‌లో ఉంచుతూ ఐజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చిలకలపూడి సీఐగా నబీని నియమించారు. చిలకలపూడి సీఐగా విధులు నిర్వహిస్తున్న సీఐ సతీష్‌కుమార్‌ను వీఆర్‌లో ఉంచారు.

ఎస్సైల బాధ్యతల స్వీకరణ

● పామర్రు ఎస్సైగా అవినాష్

పామర్రు, ఆగస్టు 9: పామర్రు ఎస్సైగా అవినాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఉయ్యూరు రూరల్ ఎస్సైగా పనిచేస్తున్న అవినాష్ బదిలీపై పామర్రుకు వచ్చారు.

పెదపారుపూడి ఎస్సైగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

పెదపారుపూడి: పెదపారుపూడి ఎస్సైగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

కృత్తివెన్ను ఎస్సైగా పైడిబాబు

కృత్తివెన్ను: కృత్తివెన్ను ఎస్సైగా ఎ.పైడిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

నందివాడ ఎస్సైగా కె.శ్రీనివాస్

నందివాడ: నందివాడ ఎస్సైగా కె.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో అవాంచనీయ ఘటనలు జరగకుండా గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. స్టేషన్ సిబ్బంది ఎస్సై శ్రీనివాస్‌కు స్వాగతం పలికారు.

తహసీల్దార్‌కు శుభాకాంక్షలు

గుడివాడ రూరల్, ఆగస్టు 9: గుడివాడ తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రామకోటేశ్వరరావును ఏపీజీఈఏ సంఘ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణాజిల్లా కార్యదర్శి టి.వరప్రసాద్, ప్రెసిడెంట్ కె.డుర్గేష్, సెక్రటరీ బి.రాజేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ జోజి, బి.సబిత రాంబాబు, ఆర్టీసీ రాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, వ్యవసాయ రంగాల్ని కాపాడండి

క్విట్ కార్పొరేట్ పేరుతో ప్రజా సంఘాల నిరసన





గుడివాడ ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు, మచిలీపట్నం రేవతీ సెంటర్‌లో ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9: కార్మిక, వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తుల నుంచి కాపాడాలంటూ మచిలీపట్నం రేవతీ సెంటర్‌లో కిసాన్‌మోర్చా, ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతోందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు విమర్శించారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.రంగారావు డిమాండ్ చేశారు. సీఐటీయూ కృష్ణాజిల్లా కోశాధికారి సుబ్రహ్మణ్యం, ఏఐటీయూసీ నాయకుడు లింగం ఫిలిప్, సీఐటీయూ నాయకుడు సీహెచ్ జయరావు, కేవీపీసీఎస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రాజేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడండి

గుడివాడ: ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్వీవీ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రజా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్లు అనే నినాదంతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పథకాన్ని 365రోజులు అమలు చేయాలని, పట్టణ ప్రాంతాల్లోనూ అమలు చేసేలా చూడాలని, కౌలు రైతులకు యజమాని సంతకం లేకుండా గుర్తింపు కార్డులను ఇవ్వాలని, చిన్నతరహా పరిశ్రమలను కాపాడాలని నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు టి.లక్ష్మణరావు, ఐద్వా పట్టణ కార్యదర్శి పి.రజిని, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు ఆర్.కొండ, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో..

బంటుమిల్లి: ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి పిలుపు మేరకు లక్ష్మీపురం సెంటర్‌లో సేవ్ వ్యవసాయరంగం-సేవ్ ఇండియా నినాదంతో రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం నుంచి కార్పొరేట్లను తొలగించి రైతులకు, కౌలురైతులకు, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, సీఐటీయూ నాయకురాలు పరుచూరి ధనశ్రీ, మాజేటి శ్రీనివాసరావు, రైతు సంఘం మండల అధ్యక్షుడు మలిశెట్టి శివరామప్రసాద్, అజయ్‌ఘోష్, గౌరిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వయంకృతాపరాధాలతో భవిష్యత్ కోల్పోకండి

● యువతకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము హితవు

గుడివాడ: స్వయంకృతాపరాధాలతో బంగారు భవిష్యత్తును చేతులారా పాడు చేసుకోవద్దని, ప్రతి విద్యార్థి సాంకేతిక విద్య జీవన నైపుణ్యాలను కలిగి ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సూచించారు. శుక్రవారం వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో ఆయన మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.హెచ్.వి.ప్రసాదరావు, ప్లేస్మెంట్ అధికారి ఎస్.నవీన్ పాల్గొన్నారు.

వైభవంగా వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గుడివాడ: వాంబేకాలనీలో వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో విగ్రహ, శిఖర ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొన్నారు. దేవస్థాన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

బొడ్డు నాగయ్య కళాశాలలో సమస్యలు పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ హామీ

పెడన, ఆగస్టు 9: ఎంతో ఘనకీర్తి కలిగిన బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తగ్గిపోవడం బాధాకరంగా ఉందని, కళాశాల సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన కళాశాలలో విద్యార్థులకు బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, ఎంఈవో-2 వై.వి. హరనాథ్, ప్రిన్సిపాల్ చంద్రశేఖరరామారావు, అబ్దుల్ ఖయూం, బళ్ల పద్మావతి, బెజవాడ నాగరాజు పాల్గొన్నారు.



బ్యాగులు, పాఠ్య, పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం

అవనిగడ్డ, ఆగస్టు 9: ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో గాంధీక్షేత్రంలో క్విట్ ఇండియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదరికం దేశంలో రాజ్యమేలుతుందన్న దున క్విట్ పావర్టీ నినాదంతో పని చేయాలని మండలి పిలుపునిచ్చారు. రావి నాగేశ్వరరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, గుడివాక శేషుబాబు, బొప్పన భాను, మండలి రామ్మోహనరావు, బండే రాఘవ, ఘంటసాల రాజమోహనరావు, యలవర్తి చిన్నా, బచ్చు రఘునాథ్, లుక్కా పిచ్చియ్య పాల్గొన్నారు.

బుద్ధప్రసాద్‌కు ఆప్తా వార్షికోత్సవ ఆహ్వానం

అమెరికాలో ఈనెల 30, 31వ తేదీల్లో నిర్వహిస్తున్న అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ 16వ వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు ఆహ్వానం అందింది. ఆప్తా ప్రతినిధి తూము రమేష్, స్థానిక విద్యావేత్త దుట్టా ఉమామహేశ్వరరావు బుద్ధప్రసాద్‌ను కలిసి ఆయనకు ఆహ్వానపత్రం అందజేశారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

కొద్దిపాటి వర్షానికే నీటిలో మునిగిపోయే అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆదేశాలతో డ్రైనేజీ ప్రక్షాళన పనులను అధికారులు చేపట్టారు. బస్టాండ్ వద్ద రోడ్డు సైడ్ డ్రైన్ నెంబర్-1 పూడికతీత పనులను ప్రారంభించారు. అవనిగడ్డ నుంచి బందలాయి చెరువు మీదుగా రత్నకోడు మేజర్ డ్రైన్‌లో కలిసే ఈ డ్రైన్ మూడు కిలోమీటర్ల పొడవునా పిచ్చిమొక్కలతో పూడుకుపోయి, మురుగు పారుదలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని దీనిని దృష్టిలో పెట్టుకుని రోడ్డు సైడ్ డ్రైన్-1లో పూర్తిస్థాయిలో పూడిక తీయిస్తున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. డ్రైనేజీ డీఈ పి.వెంకటేశ్వరరావు, ఏఈ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావు పరిశీలించారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపుతా

● మండల సమావేశంలో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పామర్రు, ఆగస్టు 9: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. 306 సీసీ రోడ్లు మరో పక్షం రోజుల్లో ప్రారంభమవుతాయని తెలిపారు. అధికారులు అందుబాటులో ఉండి సమస్యలు సత్వరమే పరిష్కరించాలన్నారు. కుమార్‌రాజాను ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీ డీవో మద్దిపట్ల భారతి, ఎంపీటీసీలు, సిబ్బంది సత్కరించారు. వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నిబద్ధత గల నాయకుడు గొట్టిపాటి వెంకట్రావు

కూచిపూడి: నిబద్ధత గల రాజకీయ నాయకుడు స్వర్గీయ గొట్టిపాటి వెంకట్రావు అని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. గొట్టిపాటి వెంకట్రావు రెండో వర్ధంతి కార్యక్రమాన్ని కూచిపూడిలో శుక్రవారం నిర్వహించారు. వెంకట్రావు టీడీపీకి చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. వెంకట్రావు చిత్రపటానికి నివాళులర్పించారు. సిలికానాంధ్ర వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గొట్టిపాటి శ్రీధర్, నన్నపనేని వీరేంద్ర, గొట్టిపాటి అరవింద్, కొడాలి దయాకర్, మండవ శ్రీకృష్ణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కుమార్‌రాజాను సత్కరిస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్, ఎంపీడీవో భారతి

భక్తులతో పోటెత్తిన సుబ్బారాయుడి ఆలయం

మోపిదేవి, ఆగస్టు 9: నాగపంచమిని పురస్కరించుకుని అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం శుక్రవారం కిటకిటలాడింది. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు స్వామిని దర్శించుకుని నాగపుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగసర్ప దోషం, రాహు కేతు పూజలకు అధిక సంఖ్యలో స్వామి నిత్య శాంతి కల్యాణంలో వందకుపైగా దంపతులు పాల్గొన్నారు. ఆలయ ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పుట్టలో పాలుపోస్తున్న భక్తులు

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి


గుడివాడ: స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీజేపీ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో కూటమి విజయానికి కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర పార్టీల పిలుపు మేరకు ఈనెల 11,12 తేదీల్లో యువమోర్చా ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో తిరంగా రన్ నిర్వహిస్తామన్నారు. 14వ తేదీన అసెంబ్లీ నియోజకవర్గస్థాయిలో సమావేశాలు నిర్వహించాలన్నారు. రామినేని వెంకటకృష్ణ, ఉన్నమట్ల కబడ్డీ, సూరే గాంధీ, సద్గుర్తి శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

కామేపల్లి తులసీబాబుకు సత్కారం

గుడివాడ: విమానాశ్రయ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా ఎంపికైన కామేపల్లి తులసీబాబును శుక్రవారం ప్రజావేదికలో టీఎస్ఎస్ఎఫ్ నాయకులు సత్కరించారు. కొసరాజు ఉపేంద్ర, గుడూరు సురేంద్ర, సూరిబాబు, వంశీ, ఇమ్మానియేల్, యేసోబు, యువజిత్, అరవింద్, పాపారావు, ఇస్సాక్, భాను, నితీష్, క్రాంతి, సాయి, ప్రసాద్ పాల్గొన్నారు.

సజ్జా రాఘవయ్య మాస్టారు కన్నుమూత

గుడివాడ: గుడివాడ పరిసర ప్రాంత ప్రజలకు రాఘవయ్య మాస్టారుగా సుపరిచితుడైన సజ్జా రాఘవయ్య(80) కొద్ది రోజులుగా అనారోగ్యంతో విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. వివిధ ప్రైవేటు పాఠశా లల్లో వివిధ హోదాల్లో పనిచేసి శుభోదయ విద్యాసంస్థను స్థాపించారు. శనివారం అంత్య క్రియలు నిర్వహిస్తామని ఆయన కుమారులు సునీల్‌కుమార్, అనీల్‌కుమార్ తెలిపారు.



కోనలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తాం: డీఎంహెచ్‌వో

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9: బందరు మండలం కోన గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెట్టేందుకు యోచిస్తున్నామని డీఎంహెచ్‌వో డాక్టర్ జి.గీతా బాయి తెలిపారు. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మాతృమూర్తి ట్రస్టు ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణతో కలిసి ఆమె ఆవిష్కరించారు. కరపత్రాలను ప్రచురించేందుకు బండి రామకృష్ణ ముందుకు రావడం ముదావహమన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబరు 1న మచిలీపట్నంలో 30 వేల మొక్కలు పంపిణీ చేస్తున్నామని బండి రామకృష్ణ తెలిపారు. ఆర్ఎంపీ వైద్యుల సంఘ రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ బి.ఆర్.ఆంజనేయులు, నూకల సత్యనారాయణ, చలమలశెట్టి నారాయణ, న్యాయవాది మధు, గణేష్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ

వరిసాగుపై అవగాహన

బంటుమిల్లి, ఆగస్టు 9: కలుపు మందులు 3 లేదా 4 రకాలు కలిపి పిచికారీ చేయొద్దని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఏడీఏ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం అర్తమూరులో వరిసాగుపై నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కలుపు మందులు ఆకు దశలోనే స్ప్రే చేయాలని ఆయన సూచించారు. ప్రతి రైతు 50 సెంట్ల నుంచి ఎకరం వరకు ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటను సాగు చేసి, వాటిని ఆహారంగా ఉపయోగించుకోవాలన్నారు. ఆత్మ ఏవో పద్మజ, వ్యవసాయశాఖ అధికారి శివరామకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్‌లో ప్రబోధ్‌కుమార్ ప్రతిభ

చల్లపల్లి, ఆగస్టు 9: జాతీయస్థాయి త్రోబాల్ పోటీలో విజయక్రాంతి విద్యార్థి జనుముల ప్రబోధ్‌కుమార్(మెరకనపల్లి) ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. బెంగళూరులో నిర్వహించిన 16వ సౌత్ జోన్ సీనియర్ నేషనల్ త్రోబాల్ చాంపియన్‌షిప్ 2024-25లో రాష్ట్ర జట్టులో ప్రాతినిధ్యం వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థిని శుక్రవారం కళాశాలలో అభినందించారు. పీఈటీ కొడాలి ప్రేమ్‌బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుడివాడ: విద్యుత్ లైన్లు, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం శనివారం పట్టణ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.



నారాయణపురంలో పర్యటిస్తున్న కలెక్టర్ బాలాజీ

ఎస్టీలకు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయండి

● అధికారులకు కలెక్టర్ బాలాజీ ఆదేశం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9: నారాయణపురం, ముస్తాఖాన్‌పేట ఎస్టీ కాలనీవాసులకు ఆధార్, జనన, కుల ధ్రువీకరణపత్రాలను వెంటనే జారీ చేయాలని అధికారులను కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. శుక్రవారం నారాయణపురం, ముస్తాఖాన్‌పేట యానాదుల కాలనీల్లో కలెక్టర్ పర్యటించారు. 200 యూనిట్ల వరకు గిరిజనులకు ఉచిత విద్యుత్ సౌకర్యం ఉందని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణులకు ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కమిషనర్ బాపిరాజు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి ప్రకాశరావు, మచిలీపట్నం నార్త్, సౌత్ తహసీల్దార్లు మధుసూదనరావు, శ్రీనివాస్, మునిసిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ పల్లపాటి సుబ్రహ్మణ్యం, మాజీ కౌన్సిలర్ గనిపిశెట్టి గోపాల్ పాల్గొన్నారు.

217 జీవో రద్దుపై మత్స్యకారుల హర్షం

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9: మత్స్యకారులకు నష్టం కలిగించే 217 జీవోను సీఎం చంద్రబాబు రద్దు చేయడంపై టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం టీడీపీ మచిలీ పట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో సీఎం చంద్రబాబు, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు వారు పాలాభిషేకం చేశారు. నడకుదిటి అర్జున, బొడ్డు శ్రీను, తిరుమాని శ్రీమన్నారాయణ, వడుగు వెంకటనారాయణ, ఏడుకొం డలు, నాగమునీంద్రరావు పాల్గొన్నారు.



చంద్రబాబు, కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

నేడు, రేపు చదరంగం పోటీలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9: అండర్-9, 13 బాలబాలికలకు ఈనెల 10,11 తేదీల్లో సన్‌స్టార్ స్కూల్‌లో ఉదయం 9 గంటలకు కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.ఫణికుమార్ తెలిపారు. శనివారం అండర్-13, ఆదివారం అండర్-9 పోటీలు జరుగుతాయన్నారు.